# బాపూనగర్ సమగ్రాభివృద్ధి బీఆర్ఎస్ ఘనతే



ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌లో మహిళలకు అభివాదం చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**

అమీర్‌పేట్, నవంబర్ 1 : బాపూనగర్ బస్తీవాసులు కోరుకుంటున్న విధంగా ఈఎస్ఐ శ్మాశానవాటికలో 3వ రోజున పెద్దలను స్మరించుకుంటూ జరిపే కర్మాకాండల కు ప్రత్యేక వేదిక నిర్మిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బస్తీవాసులకు ఈ వేదికను నిర్మించి ఇవ్వడాన్ని జీర్ణించుకోలేని కొందరు కోర్టు స్టే తీసుకువచ్చి వేదిక నిర్మాణాలు అడ్డుకున్నారన్నారు. అయితే ఇదంతా తాత్కాలికమేనని చెబుతూ రాబోయే రోజుల్లో స్టే ఎత్తే యడం ఖాయమన్నారు. బుధవారం అమీర్‌పేట్ డివిజన్‌లోని బాపూనగర్ బస్తీలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీ మహిళలు మంత్రి తలసానికి అడుగడుగునా మంగళ హారతులతో స్వాగతాలు పలికారు. అనంతరం మంత్రి తలసాని మాట్లాడుతూ.. సన్న వీధులున్న బాపూనగర్ బస్తీ అభివృద్ధికి దూరంగా ఉండేదని, తాను ఎమ్మెల్యేగా వచ్చిన తరువాత గడిచిన తొమ్మిదిన్నర ఏండ్లలో బస్తీలో తాగునీటి, డ్రైనేజీ, వరదనీటి కాలువల నిర్మాణాలు పూర్తి చేసి చక్కటి సీసీ రోడ్లు నిర్మించామన్నారు. బస్తీవాసులకు కల్యాణలక్ష్మి, అత్యవసర ఆరోగ్య పరిస్థితులు తలెత్తిన సందర్భాల్లో సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం వంటివి పథకాలు అందించామని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికి అందాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు.

**రూ.400లకే గ్యాస్ సిలిండర్..**

రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు రూ. 400లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని మంత్రి పేర్కొన్నారు. బాపూనగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్, మసీదు బస్తీలో నిర్వహించిన ప్రచారానికి అనూహ్య స్పందించ వస్తుండటంతో పార్టీ క్యాడర్ మరింత ఉత్సాహంతో ప్రచారాన్ని పరుగులెత్తిస్తున్నారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం రూ. 15 లక్షల వరకు ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

**బాపూనగర్‌లో చేపట్టిన పనుల్లో కొన్ని...**


- రూ.10లక్షలతో బస్తీ కమ్యూనిటీహాలు అదనపు అంతస్తు నిర్మాణాలు
- ఇటీవల అంగన్‌వాడీ స్కూల్ నిర్మాణానికి రూ. 30 లక్షల నిధులు మంజూరు
- బస్తీలోని తొలగించిన పబ్లిక్ టాయ్‌లెట్ల స్థానంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు
- బస్తీలో అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టకు పెద్ద సంఖ్యలో సీసీ కెమెరాల ఏర్పాటు
- దశాబ్దాలుగా నోచుకోని ముస్లిం వీధిలో వరదనీటి కాలువ నిర్మాణాలు చేపట్టారు.
- బస్తీలో అడుగడుగునా సీసీ రోడ్ల నిర్మాణాలు

## అభివృద్ధిని కోరుకుంటున్నారు: మంత్రి తలసాని

బేగంపేట్, నవంబర్ 1 : ప్రజలు లభివృద్ధి సంక్షేమాన్ని కోరుకుంటున్నారని, అది బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని బీఆర్ఎస్ పార్టీ సనత్‌నగర్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద రాంగోపాల్‌పేట్ డివిజన్‌కు చెందిన సందీప్, నవీన్, లలిత్, రాజేందర్ నాయకత్వంలో 10 మంది యువకులు బీజేపీ పార్టీకి రాజీనామా చేసి మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సంధర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలోకి చేరికల పరంపర కొనసాగుతుందని తెలిపారు. విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, యువత ఇలా ప్రతి ఒక్కరి చూపు బీఆర్ఎస్ వైపే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అభిషేక్ పాల్గొన్నారు.



మంత్రి తలసాని సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువత



బోయిగూడలోని పలు అపార్ట్‌మెంట్లలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు పవన్‌కుమార్‌గౌడ్, తలసాని మహేశ్‌యాదవ్, వెంకటేశన్ రాజు, ఎం.మహేందర్, లంబుశ్రీను, ముక్కశ్రీను, సుధాకర్‌రెడ్డి, సురేశ్ – (బన్సీలాల్‌పేట్)



పద్మారావునగర్‌లోని హమాలిబస్తీలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు కుశాల్, కౌసల్య, దుర్గ తదితరులు –(బన్సీలాల్‌పేట్)

## బేగంపేట్ అభివృద్ధికి కృష్ణన్న కృషి

బేగంపేట్, నవంబర్1: కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణన్న బేగంపేట్ డివిజన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, 90 శాతం అభివృద్ధి చేసి ప్రజల మెప్పు పొందారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మాధవరం కృష్ణారావు అత్యధిక మెజార్టీతో గెలుస్తాడని బేగంపేట్ కార్పొరేటర్ టి.మహేశ్వరి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం బేగంపేట్‌లోని ప్రకాశ్‌నగర్ బస్తీల్లో ఆమె స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి మాధవరానికి మద్ధతుగా ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారు ఇంటింటికి వివరించారు.

**కార్యకర్తలంతా ఐక్యంగా పని చేయాలి**

కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి మాధవరం కృష్ణారావు, ఇటు సనత్‌నగర్ నుంచి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ గెలుపునకు కార్యకర్తలంతా ఐక్యంగా పని చేసి వారి గెలుపునకు కృషి చేయాలని బేగంపేట్ డివిజన్ కార్పొరేటర్ మహేశ్వరి కోరారు. బుధవారం బేగంపేట్ డివిజన్‌లో ఆమె బూత్‌స్థాయి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.



బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌బస్తీ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మహేశ్వరి

ప్రచారంలో ఓటర్ల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, సురేశ్‌యాదవ్, నరేశ్, సీ.సత్యనారాయణ, తాళ్ల రాజయ్య, పేపర్ శ్రీనుతోపాటు మహిళా కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వైద్య పరీక్షలు నిర్వహిసున్న వైద్యులు. పక్కన ఎస్ఆర్‌నగర్ మ్యాగ్నిస్ డైరెక్టర్ సింగం శ్రీనివాస్‌రావు

## అవినీతి నిర్మూలన అందరి బాధ్యత



వాకథాన్ ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

బన్సీలాల్‌పేట్, నవంబర్ 1 : విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, దక్షిణ ప్రాంతీయ ప్రధాన కార్యాలయం–1 ఆధ్వర్యంలో బుధవారం 'అవినీతి వద్దని చెప్పండి–దేశానికి కట్టుబడి ఉండండి' అనే అంశంపై సంజీవయ్య పార్కు రహదారిలో వాకథాన్ పేరుతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ జనరల్ మేనేజర్ (విజిలెన్స్) జీ.ఎస్.ఆర్.రావు మాట్లాడుతూ..అవినీతి నిర్మూలన గురించి తమ సంస్థ ఉద్యోగులకు మాత్రమే కాకుండా సాధారణ ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అవినీతి రహిత దేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలన్నారు. ఈ వాకథాన్‌లో పవర్‌గ్రిడ్ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు అలోక్‌కుమార్ శర్మ, ఎస్‌వీ.వెంకట్, సంజయ్‌కుమార్ గుప్తా, పలు విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రైస్తవ శ్మశానవాటికలో పారిశుధ్య పనులు



ప్రతి ఏడాది నవంబర్ 2వ తేదీన క్రైస్తవ శ్మశానవాటికలో జరిగే పవిత్ర ఆత్మల దినం(ఆల్ సోల్స్ డే) సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాలతో జీహెచ్ఎంసీ అధికారులు పారిశుధ్య పనులను చేపట్టారు. గురువారం రోజున పెద్దఎత్తున వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టామని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, కె.వెంకట్, శ్మశానవాటిక ఇన్‌చార్జి జయరాజ్, బెన్‌హర్ తెలిపారు.

*– బన్సీలాల్‌పేట్, నవంబర్ 1*

## టీఎన్జీవో హౌసింగ్‌బోర్డు కార్యవర్గం ఎన్నిక



సుల్తాన్‌బజార్, నవంబర్ 1: టీఎన్జీవో హౌసింగ్ బోర్డు యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. బుధవారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో ఎన్నికల అధికారిగా జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారిగా శాఖ ప్రచార కార్యదర్శి వైదిక్ శస్త్ర వ్యవహరించారు. టీఎన్జీవో హౌసింగ్ బోర్డు యూనిట్ అధ్యక్షుడిగా జీవీ రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా సీహెచ్.సంజీవరెడ్డి, కార్యదర్శిగా ఆర్.జగదీశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ఎ.రామ్‌కుమార్, ఎం.ప్రణయ్, కోశాధికారిగా ఆర్.రఘురాం కుమార్, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా ఆజ్మీరా రాంబాబు, మహ్మద్ అబ్దుల్ సలీం, కార్యవర్గ సభ్యులుగా మహ్మద్ అబ్దుల్ ముక్తధర్, జే సాయివర్ధన్, మహ్మద్ రహీం, జి.భాగ్యలక్ష్మి, బి.వెంకటేశ్వర్లు,కే నిరంజన్‌రెడ్డి, మహ్మద్ సజావుద్దీన్, సి.మల్లేశ్ ఎన్నికైనట్లు వారు వివరించారు. అనంతరం జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేసి అభినందించారు. యూనిట్ నూతన కార్యవర్గం ముజీబ్‌హుస్సేనీతో పాటు కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్, ఎన్నికల అధికారులు రాజ్‌కుమార్, వైదిక్ శస్త్రను శాలువాలతో సన్మానించారు.